

పెన్షన్ భిక్ష కాదు..
ఉద్యోగుల పెన్షన్ భిక్ష కాదని.. అది వారి హక్కు అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు.
- 10లో



మూడో వసంతంలోకి..
జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమం మూడో వసంతంలోకి అడుగుపెడుతోంది.
- 8లో

గరిష్టం/కనిష్టం
30.0°/18°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

స్థలం తక్కువ.. ఫీజు ఎక్కువ!

సాగర్ క్వార్టర్ల క్రమబద్ధీకరణలో వింత ధోరణి

- రెగ్యులరైజేషన్ పేరిట ఎక్కువ స్థలానికి ఫీజుల వడ్డింపు
- గత నెలలో మొదటి విడత డీడీలు చెల్లించిన ప్రజలు
- విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లభించని పరిష్కారం
- ఈనెల 25తో ముగియనున్న రెండో విడత గడువు
- ఇప్పుడు కూడా అధిక మొత్తం చెల్లించాల్సి వస్తుందని ఆవేదన



హిల్‌కాలనీ వ్యూ

నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్‌పీ) క్వార్టర్‌లో నివసిస్తున్న కిశోర్ (పేరు మార్చాం) కుటుంబం తమ ఇంటి స్థలం క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. అందుకు అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. క్రమబద్ధీకరణ కోసం చెల్లించాల్సిన ఫీజు మొత్తం ఒకేసారి లేదా మూడు వాయిదాల్లో మీసేవ కేంద్రంలో లేదా బ్యాంకు డీడీ ద్వారా చెల్లించాలని కలెక్టర్ పేరిట డిమాండ్ నోటీసు వచ్చింది. కిషోర్ కుటుంబం దరఖాస్తు చేసుకున్న ఇంటి(స్థలం) విస్తీర్ణం 250 గజాలైతే నోటీసులో మాత్రం 490 గజాలకు దరఖాస్తు చేసుకున్నట్లుగా వచ్చింది. అందులో 460 గజాల స్థలం క్రమబద్ధీకరణకు రూ.4 లక్షల ఫీజు చెల్లించాలని ఉంది. దానిని సరిచేయాలని పెద్దవూర తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వగా కలెక్టరేట్‌కు పంపిస్తామని చెప్పారు. అప్పటికే మొదటి విడత డబ్బు చెల్లించాల్సిన గడువు సమీపించింది. మొదటి విడత డబ్బు చెల్లించారు. ఈనెల 25న రెండో విడత డబ్బు చెల్లింపు తేదీ ముగియనుంది. ఇప్పటివరకు తాను చేసిన విజ్ఞప్తి పరిష్కారం కాలేదు. దీంతో ఇప్పుడు కూడా అదనపు మొత్తం చెల్లించాల్సి వస్తుందని కిశోర్ వాపోతున్నారు. ఈ బాధ కిశోర్ ఒక్కడిదే కాదు.. ఎన్ఎస్‌పీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ నోటీసు అందుకున్న చాలా మంది ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు.

మూడు వాయిదాల్లో చెల్లించాలని నిబంధన..

125 గజాల కంటే ఎక్కువ స్థలం కలిగిన ఇళ్లల్లో ఉంటున్న వారంతా క్రమబద్ధీకరణ కోసం డిసెంబరు 25వ తేదీలోగా 35శాతం, 2023 జనవరి 25వ తేదీలోగా 35శాతం, ఫిబ్రవరి 25వ తేదీలోగా మిగితా 30 శాతం చొప్పున నిర్ణీత ఫీజును చెల్లించాలని స్పష్టం చేసింది. ఇందులో రెండో వాయిదా ఫీజు చెల్లింపు ఈనెల 25తో ముగియనుంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సాగర్ క్వార్టర్ల క్రమబద్ధీకరణలో వింత ధోరణి కనిపిస్తోంది. స్థలం లేకున్నా క్రమబద్ధీకరణ పేరిట అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారు. స్థలాలు తక్కువగా ఉన్నా ఎక్కువ స్థలానికి ఫీజు చెల్లించాలని వారికి నోటీసులు అందాయి. దీనిపై వెంటనే అధికారులకు విన్నవించినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికే మొదటి విడత వాయిదాలు చెల్లించారు.. రెండు రోజుల్లో రెండో విడత వాయిదా చెల్లించాల్సి ఉంది. ఈ పరిస్థితిలో తమపై అదనపు భారం పడుతోందని ప్రజలు లబోదిబోమంటున్నారు. తప్పులను సరి చేయాలంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాము చేసుకున్న విజ్ఞప్తులు అలాగే ఉండిపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదని, లేని స్థలానికి డబ్బులు ఎలా చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రమబద్ధీకరణకు1,086 మంది దరఖాస్తు..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేసుకున్న వారికి ఆ స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం గతేడాది మార్చి 22వ తేదీన 58, 59 జీఓలను జారీ చేసింది. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆ జీఓలను నందికొండ మున్సిపాలిటీలో క్వార్టర్ల క్రమబద్ధీకరణకు వర్తింపజేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జీఓ 58 ప్రకారం 125 చదరపు గజాల లోపు స్థలాలున్న ఇళ్లను అర్హులైన వారికి ఉచితంగా క్రమబద్ధీకరించనుంది. ఇక 59 జీఓ ప్రకారం వెయ్యి గజాల వరకు ప్రభుత్వం నిర్దేశించిన ధర చెల్లించాల్సి ఉంటుంది. నందికొండలో 2014 జూన్ 2వ తేదీకి ముందునుంచి ఆ ఇంట్లో నివసిస్తున్న వారికే క్రమబద్ధీకరిస్తామని పేర్కొంది. దీంతో 1,086 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిపై తహసీల్దార్ తదితర అధికారులతో కూడిన కమిటీ గత అక్టోబర్, నవంబర్ నెలల్లో క్షేత్రస్థాయిలో విచారణ జరిపింది. ఆ నివేదిక ప్రకారం ముందుగా 300కుపైగా ఇళ్లను క్రమబద్ధీకరిస్తామని లబ్ధిదారులకు కలెక్టరేట్ నుంచి నోటీసులు అందాయి.

పొరపాటెవరిది..?

దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలనే ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలనలో పొరపాట్లు దొర్లాయా? మరేదైనా సాంకేతిక కారణంతో జరిగిందా అన్నదానిపై ఎవరూ స్పష్టత ఇవ్వడం లేదు. హడావుడిలో వివరాలు అప్‌లోడ్ చేసే సమయంలోనే పొరపాట్లు దొర్లాయనే అనుమానాలున్నాయి. ఒక ఇంటి (స్థలం) విస్తీర్ణం బదులు పక్కనున్న స్థల విస్తీర్ణం నమోదు కావచ్చని భావిస్తున్నారు. నాగార్జునసాగర్‌లో క్వార్టర్ల నిర్వహణ చూస్తున్న ఆర్అండ్‌బీ విభాగం గతంలో ఏ క్వార్టర్ విస్తీర్ణం ఎంతనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది. ఆ వివరాలతో సరిపోల్చుకున్నా పొరపాటు ఎక్కడ జరిగిందో తెలిసే వీలుంది. కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయ అధికారులు కనీసం బాధితుల దరఖాస్తుల్ని పరిశీలించినా ఎక్కడ పొరపాటు జరిగిందో తెలిసే వీలుంది. వాటిని పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ప్రజలు లేని భూమికి అధిక మొత్తంలో ఫీజు చెల్లించాల్సి వస్తోంది.

అదనపు భారం మోసేదెలా..?

వాస్తవ విస్తీర్ణం కంటే తక్కువగా పడిన వారికి స్థలం తగ్గనుంది. అయితే అదనపు మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదు. తక్కువ విస్తీర్ణం ఉండి ఎక్కువ విస్తీర్ణానికి ఫీజు విధించిన వారికి అదనపు భారం మోయలేని విధంగా మారింది. వాస్తవ విస్తీర్ణానికి దాదాపు రూ. 2.17 లక్షలు చెల్లించాల్సిన వారు రూ.4 లక్షలకు పైగా చెల్లించాల్సి వస్తుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సమస్యలను పరిష్కరించే వరకు కనీసం ఫీజు చెల్లింపు గడువును పొడిగించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

న్యూస్‌రీల్

‘అగ్ని కణాలు’ ఎంతో ప్రాధాన్యం కలిగిన పుస్తకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహారెడ్డి

రామగిరి(నల్లగొండ) : అగ్ని కణాలు పుస్తకం ఎంతో ప్రాధాన్యం కలిగిన పుస్తకమని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఏ.నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకుడు కోమటిరెడ్డి అనంతరెడ్డి రచించిన అగ్ని కణాలు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచి నేటి వరకు వివిధ పోరాటాల్లో అనేక మంది విప్లవ వీరులు నేల కొరిగారని, దోపిడీ, పీడన లేని సమాజం కోసం ఉమ్మడి జిల్లా విప్లవ కమ్యూనిస్టులు ప్రత్యేక పాత్ర పోషించారని చెప్పారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు మేక రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యాయవాది భద్రయ్య, బహుజన కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కే.పర్వతాలు, బద్ద సత్యనారాయణ, కొమరయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, సీహెచ్.సుధాకర్ రెడ్డి, శీలం స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఏఓయూ న్యాక్ గ్రేడ్‌కు సహకరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ బి.ధర్మానాయక్

రామగిరి(నల్లగొండ) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం న్యాక్ గ్రేడ్ కోసం వెళ్తున్నందున కౌన్సిలర్లు, విద్యార్థులు సహకరించాలని యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ధర్మానాయక్ కోరారు. ఆదివారం నల్లగొండ రీజనల్ స్టడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా విద్యనభ్యసించిన అనేక మంది విద్యార్థులు సివిల్స్‌కు ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. యూనివర్సిటీ న్యాక్ ఏ గ్రేడ్ సాధించడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని కోరారు. న్యాక్ సంస్థ నుంచి వచ్చిన యిఇల్స్‌కు విద్యార్థులు స్పందించి సమాధానం ఇవ్వాలని కోరారు. సమావేశంలో అంతటి శ్రీనివాసులు, సుంకరి రాజారామ్, కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచ నారసింహుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : పంచనారసింహులు కొలువై ఉన్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు సుప్రభాతం, స్వయంభూలకు బిందె తీర్థం, ఆరాధన, బాల భోగం నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, సహస్రనామార్చన చేపట్టి, తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహనసేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన గావించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

ఓ లింగా..



కేసారం నుంచి పెద్దగట్టుకు దేవరపెట్టెను తరలిస్తున్న భక్తులు

- వైభవంగా పెద్దగట్టు జాతర దిష్టిపూజ మహోత్సవం
- కేసారం నుంచి గట్టుకు చేరిన దేవరపెట్టె
- భారీగా తరలివచ్చిన భక్తులు

చివ్వెంల, సూర్యాపేట రూరల్ : రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతర శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర దిష్టి పూజ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. సుమారు 500 సంవత్సరాల చరిత్ర గల ఈ జాతర రెండు సంవత్సరాలకు ఒకమారు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జరగనున్న జాతరకు పదిహేను రోజుల ముందు ఆదివారం నాడు యాదవుల సంప్రదాయం ప్రకారం దిష్టిపూజ మహోత్సవం జరిపించారు. ఈమేరకు ఆదివారం రాత్రి సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి మెంతబోయిన, మున్న, గోర్ల, బైకాను వంశస్తులు బియ్యం, పాలు, పెరుగు, నెయ్యి, కుంకుమ, కొబ్బరి కాయలు, నిమ్మకాయలు, గుగ్గిలం, మైశాచి, తల్లి, పిల్ల గొర్రెతోపాటు శ్రీ లింగమంతులస్వామి, గంగమ్మ, ఆకుమంచమ్మ, యలమంచమ్మ, చౌడమ్మలతో ఉన్న దేవరపెట్టెతో ఊరేగింపుగా గట్టుకు బయలుదేరారు. దేవరపెట్టెను గుట్టకు పడమర వైపు ఉన్న మెట్లపై నుంచి గట్టుపైకి చేర్చి ఆలయం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణం చేశారు. దిష్టిపూజకు అవసరమైన రెండు బోనాలను మున్న, మెంతబోయిన వారు తీసుకువచ్చి లింగమంతుస్వామికి సమర్పించారు. అనంతరం బైకాని వారు వాయిద్యాల నడుమ బలిహరణ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, జెడ్పీటీసీ భిక్షం, ఎంపీపీ రవీందర్‌రెడ్డి, రామ్మూర్తి యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



భేరీ మోగిస్తున్న యాదవ కులస్తులు

భారీ పోలీసు బందోబస్తు..

దిష్టి పూజ కార్యక్రమంలో భాగంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ నాగభూషణం, ఇద్దరు సీఐలు, 11 మంది ఎస్ఐలు, 34 మంది ఏఎస్ఐలు, 37 మంది కానిస్టేబుల్స్, 29 మంది హోంగార్డులతో బందోబస్తు నిర్వహించారు.

పిలుపు ఒకరిది.. అరెస్టులు మరొకరిని



టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో టీఎస్ యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ : ఉపాధ్యాయుల బదిలీల విషయంలో న్యాయం చేయాలంటూ ఓ సంఘం ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునివ్వగా.. ఆ పిలుపునకు సంబంధంలేని టీఎస్‌యూటీఎఫ్ నేతలను పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. 317 జీఓ అమలు సందర్భంలో 13 జిల్లాల్లో స్పౌజ్ కేసు కింద బదిలీలకు అవకాశం ఇవ్వకుండా నిలుపుదల చేయడంతో ఆ బాధితులంతా ఆదివారం ప్రగతి భవన్ ముట్టడిస్తామని శనివారం పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు టీఎస్‌యూటీఎఫ్ సంఘం పిలుపు నిచ్చిందని పొరబడి అంతటా ఆ సంఘం నాయకులను అరెస్టు చేశారు. నల్లగొండలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులును తెల్లవారుజామున ఇంటివద్దకు వెళ్లి అరెస్టు చేయగా.. ఎన్జీ కళాశాలలో వాకింగ్ చేస్తున్న ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమళ్ల వెంకటేశం, కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డిని అరెస్టు చేసి టూటౌన్‌కు తరలించారు. ఆ తర్వాత నలపరాజు వెంకన్న, రమణ తదితర సంఘం నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కేంద్రంతోపాటు మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా, మల్లేపల్లి, చిట్యాల, కట్టంగూర్, నకిరేకల్ తోపాటు చాలా ప్రాంతాల్లో టీఎస్ యూటీఎఫ్ నాయకులను ఆదివారం తెల్లవారుజామునే అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆ సంఘం నాయకులు ప్రగతిభవన్ ముట్టడి పిలుపునకు తమకు సంబంధం లేదని జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారిని విడిచిపెట్టాలని ఎస్పీ ఆదేశాలు ఇవ్వడంతో అందరినీ విడుదల చేశారు.

దిలేర్ పుస్తకావిష్కరణ



దిలేర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండకు చెందిన ప్రముఖ కవి సైబాబ కవిత్వం ‘దిలేర్’ పుస్తకాన్ని కవి విమర్శకుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో ఈ పుస్తకావిష్కరణ జరిగింది. మోత్కూరు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ దర్శకులు వేణు ఊడుగుల, డాక్టర్ పగడాల నాగేందర్, బైరెడ్డి కృష్ణారెడ్డి, అంబటి వెంకన్న, దాసోజు లలిత, దేవేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అర్చకులకు ఆదరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- నూతన పంచాంగం ఆవిష్కరించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ రాష్ట్రంలో అర్చకులకు, రైతాంగానికి బీఆర్ఎస్ హయంలో ఆదరణ, సముచిత గౌరవం దక్కిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని టీటీడీ కల్యాణ మండపంలో శోభకృత్ నామ సంవత్సర 18వ పంచాగంతో పాటు పుష్కర పంచాంగాన్ని ఆయన ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు అర్చకులకు, రైతులకు పిల్లను ఇవ్వాలంటే భయపడే రోజులు ఉండేవని సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన పథకాలు, విప్లవాత్మక మార్పుల వల్ల విదేశాల్లో ఉన్న అర్చకులు స్వదేశానికి వస్తున్నారని.. ఐటీ ఉద్యోగులు సైతం తమ ఉద్యోగాన్ని వదులుకొని గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిలో దేశంలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిన నేపథ్యంలో కేసీఆర్‌పై కక్ష్య కట్టి మతాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టడానికి యత్నిస్తున్న వారి విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, మోహనశర్మ, అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపేంద్రశర్మ, అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, మున్సిపల్ చైర్మన మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లయినా రుణం రాలే!

- బీసీ కార్పొరేషన్‌లో దరఖాస్తులే తప్ప అందని లోన్లు
- దరఖాస్తుదారులకు తప్పని ఎదురుచూపులు
- 2018లో దరఖాస్తు చేసుకున్న వారికి రూ.50 వేల రుణాలతోనే సరి
- రూ.లక్షా.. ఆపైన ఊసేలేదు
- ఈ సారైనా అందేనా



ఏడేళ్లుగా అందని రుణాలు..

నల్లగొండ : కార్పొరేషన్ రుణాల కోసం బీసీలకు పడిగాపులు తప్పడం లేదు. బీసీ కార్పొరేషన్ రుణం పొందాలంటే ఏళ్ల తరబడి రణమే చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా రుణాల కోసం దరఖాస్తులు చేయడం, ఆ తర్వాత కార్యాలయాల చుట్టూ తిరగడం తప్ప రుణాలు మాత్రం అందని పరిస్థితి. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఏడేళ్ల కాలంలో రూ.50 వేల రుణాలు తప్ప రూ.లక్ష పైబడిన రుణాలు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. అయితే ముందస్తు ఎన్నికలు వస్తాయన్న ప్రచారం జరుగుతుండడంతో ఈ సారైన రుణాలు అందుతాయని ఆశతో ఉన్నారు.

40,530 మంది దరఖాస్తు

2015 నుంచి ఇప్పటి వరకు బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 40,530 దరఖాస్తులు చేసి ఉన్నారు. అందులో రూ.లక్ష రుణాలకు 5,262 మంది, రూ.2 లక్షలకు 17,577 మంది, రూ.2 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు దరఖాస్తు చేసుకున్నవారు 17,316 మంది ఉన్నారు. ఇందులో రజక సొసైటీ, నాయీబ్రాహ్మణ, వడ్డెర, సంగర, కృష్ణ బలిజ, వాల్మీకిబోయ, బట్రాజు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, మేదర, గీత తదితర కార్పొరేషన్లకు సంబంధించి సొసైటీల ద్వారా రూ.12 లక్షల రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారు ఉన్నారు.

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యాదవులకు గొర్రెల పంపిణీ.. మత్స్యకారులకు చేపలు పట్టేందుకు వలలు, వాహనాలు, బైకులు, గూడ్స్ వాహనాలను కూడా ఇస్తోంది. కానీ మిగిలిన బీసీలకు కార్పొరేషన్ ద్వారా.. బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలు ఇస్తామని చెప్పినా అది కార్యరూపం దాల్చలేదు. తెలంగాణ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చిన సందర్భంలో 2015లో రుణాలు విడుదల చేసింది. ఆ తరువాత 2015 నుంచి 2017 వరకు రుణ ప్రణాళికను ప్రకటించలేదు. దీంతో ఆ మూడు సంవత్సరాలు బీసీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి రుణాలు అందలేదు. 2014లోని రుణాలను మాత్రమే గ్రౌండింగ్ చేసుకుంటూ వచ్చారు. ఆ తరువాత 2018లో ప్రభుత్వం తిరిగి రుణాలు ఇస్తామని యాక్షన్ ప్లాన్ విడుదల చేయడంతో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి.

ఎన్నికల సమయంలో రూ.50 వేలు మంజూరు

గత అసెంబ్లీ ఎన్నికల ముందు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం రూ.50 వేల రుణాలు అందించింది. లక్ష రూపాయల రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా రూ.50 వేల రుణాలుగా మార్చుకోవచ్చని చెప్పింది. రూ.50 వేల రుణం తీసుకున్న వారు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. దీంతో చాలా మంది మార్చుకున్నారు. ఎన్నికల ముందు ఆగస్టు 15వ తేదీన కొందరికి.. ఎన్నికలు పూర్తయ్యాక మరి కొందరికి రూ.50 వేల రుణాలు ఇచ్చింది. కానీ, రూ.లక్షపై చిలుకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి ఐదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు వాటిపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. రుణాల విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదని జిల్లా అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

మెట్ల పైనుంచి జారిపడి మత్స్యకార్మికుడి మృతి


తులసీదాసు (ఫైల్)

అర్వపల్లి: ఇంట్లో మెట్ల పైనుంచి జారిపడి మత్స్యకార్మికుడు మృతిచెందిన ఘటన జాజిరెడ్డిగూడెం మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లంపల్లి గ్రామానికి చెందిన మత్స్యకార్మికుడు గద్దగూటి తులసీదాసు(45) ఆదివారం గ్రామ శివారులోని చెరువులోకి తోటి మత్స్యకార్మికులతో కలిసి చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. అనంతరం స్నానం చేయడానికి వెళ్తూ ఇంటి పైన ఆరేసిన దుస్తులు తీసుకొని కిందికి వస్తూ మెట్ల పైనుంచి జారిపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టుపక్కలవారు వచ్చి చూసేసరికి అప్పటికే తులసీదాసు మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజు, అర్వపల్లి దేవస్థాన మాజీ చైర్మన్ బైరబోయిన సైదులు, ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు తదితరులు గ్రామానికి వచ్చి తులసీదాసు మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడు నిరుపేద కుటుంబానికి చెందినవాడని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


గంజికుంట సాంబయ్య

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని హనుమాన్‌పేట కాలనీలో నివాసముంటున్న గంజిగుంట సాంబయ్య గత కొన్ని రోజులుగా కనిపించడం లేదని అతడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ ఎస్. కృష్ణయ్య ఆదివారం తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తున్న సాంబయ్య గతేడాది నవంబర్ 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి రాలేదని, ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం రాత్రి అతడి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440731986, 8186865497 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముచ్చటగా మూడో వసంతంలోకి..

- నేటితో రెండేళ్లు పూర్తి చేసుకున్న నిత్య జనగణమన గీతాలాపన
- నల్లగొండ పట్టణంలో రోజూ కొనసాగుతున్న కార్యక్రమం
- జిల్లా అంతటా విస్తరించేందుకు ప్రయత్నిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు
- నేడు చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ద్వితీయ వార్షికోత్సవం
- హాజరుకానున్న సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో జాతీయ గీతాలాపన చేస్తున్న పట్టణవాసులు

రామగిరి(నల్లగొండ): యువతలో దేశభక్తి పెంపొందించాలనే సంకల్పంతో జనగణమన ఉత్సవ సమితి ఆవిర్భవించింది. ఈ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 2021 జనవరి 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమం ప్రారంభమై సోమవారంతో రెండేళ్లు పూర్తయ్యాయి. పోలీసు శాఖ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 12 కూడళ్లలో మైక్‌లను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు అన్ని కూడళ్లలో ఒకేసారి జాతీయ గీతాలాపన ప్రారంభమవుతుంది. ఆ సమయంలో రోడ్లపై వెళ్తున్న పాదచారులతో పాటు వాహనదారులు సైతం స్వీయ క్రమశిక్షణతో తమ వాహనాలు ఆపి జాతీయ గీతం ఆలపిస్తారు.

ఇతర ప్రాంతాలకు విస్తరణ..

మొదట నల్లగొండ పట్టణంలో మాత్రమే నిర్వహించిన ఈ జాతీయ గీతాలాపనకు ప్రజల్లో మంచి స్పందన వస్తుండడంతో ఇతర ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించారు. 2022 జనవరి 27న తిప్పర్తి మండల కేంద్రంలో, 2022 ఆగస్టు 15న నార్కట్‌పల్లిలో, శుక్రవారం నుంచి పానగల్లులో ప్రారంభించారు. దాతల సహకారంతో రాబోయే రోజుల్లో మిర్యాలగూడ, చండూరు, మునుగోడు, కనగల్‌లో కూడా జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు.

నేడు 'ద్వితీయ' వేడుకలు

నల్లగొండ పట్టణంలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షహాల్‌లో సోమవారం ద్వితీయ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 'జాతీయ సమైక్యతను పెంపొందించడంలో యువత పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యాం హాజరవుతున్నట్లు తెలిపారు.

అంతటా విస్తరించేందుకు కృషి



మొదట ఈ కార్యక్రమాన్ని నల్లగొండ పట్టణంలో మాత్రమే నిర్వహించాం. దాతలు ముందుకు రావడంతో తిప్పర్తి, నార్కట్‌పల్లి, పానగల్లులో కూడా ప్రారంభించాం. రాబోయే రోజుల్లో జిల్లా అంతటా అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో నిత్యం జాతీయ గీతాలాపన ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

– కర్నాటి విజయ్‌కుమార్, జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు

ప్రజల స్పందన బాగుంది



నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి ప్రజలు, యువత నుంచి స్పందన బాగుంది. చిన్న వయసు వారి నుంచి వృద్ధుల వరకు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయడమే మా లక్ష్యం. ప్రతిఒక్కరిలో దేశభక్తి పెంపొందించేందుకు గాను జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తాం.

– కొలనుపాక రవికుమార్, జనగణమన ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి

వ్యక్తిని హత్య చేసి.. ఆపై కాల్చేసి..

- కలకలం రేపిన సగం కాలిన మృతదేహం
- గుర్తుపట్టలేనంతగా కాలిన ముఖం, ఛాతి భాగం
- చెర్వుగట్టు గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో ఘటన
- హతుడి వివరాల కోసం పోలీసుల ఆరా


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శివరాంరెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ

నార్కట్‌పల్లి: ఓ వ్యక్తిని హత్య చేసి ఆపై కాల్చేశారు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామ శివారులో వెలుగుచూసింది. కలకలం రేపిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెర్వుగట్టు గ్రామ శివారులో మోటే లక్ష్మయ్య వ్యవసాయ భూమి వెనకాల ఉన్న వెంచర్‌లో ఆదివారం ఉదయం గడ్డి కాలిపోయి ఉండటం గమనించిన స్థానికులు దగ్గరికి వెళ్లి చూడగా, సగం కాలిన వ్యక్తి కాళ్లు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎక్కడో హత్య చేసి రాత్రి సమయంలో ఇక్కడకు తీసుకొచ్చి కాల్చి ఉంటారని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, ముఖం, ఛాతి భాగం గుర్తుపట్టలేనంతగా కాలిపోయిందని, మృతుడు నీలి రంగు నైట్ ప్యాంట్, ఎరుపు రంగుపై బూడిద రంగు గీతలు కలిగిన టీషర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ శివరాంరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం అమావాస్య కావడంతో చెర్వుగట్టు రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అయితే, రాత్రి సమయంలో వెంచర్‌లో మంటలు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదని తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బొడిగె రామకృష్ణ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440795635, 9440795610 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా రాజోలు నుంచి ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ వైపునకు వస్తుంది. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున లక్కారం శివారులోని తంగేడు వనం వద్దకు చేరుకోగానే రోడ్డు పక్కన లారీ ఆగి ఉండటం గమనించిన బస్సు డ్రైవర్ తన బస్సును సైతం ఆపుకున్నాడు. ఇదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ వేముల రాంమోహన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పాండు తెలిపారు.

టీకా వికటించి చిన్నారి మృతి

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు, కేసు నమోదు


చిన్నారి మృతదేహంతో రోదిస్తున్న తల్లిదండ్రులు

కోదాడరూరల్: అంగన్‌వాడీలో వేసిన టీకా వికటించి తమ చిన్నారి మృతిచెందాడని ఆదివారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆ చిన్నారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని దేవరియ జిల్లాకు చెందిన సన్నెయికుమార్ గౌడ్ కోదాడకు వలస వచ్చి పట్టణంలో పానీపూరి బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి రెండు నెలల ఇరవై రోజుల వయసున్న బాబు ఉన్నాడు. ఆ చిన్నారికి టీకా వేయించేందుకు శనివారం పట్టణంలోని యాదవబజార్‌లో గల అంగన్‌వాడీ సెంటర్‌కి తీసుకెళ్లారు. చిన్నారికి జలుబు ఉన్నప్పటికీ అక్కడ ఏఎన్‌ఎం జయ నిర్లక్ష్యంగా వ్యవహరించి ఏమీకాదని టీకా వేసింది. కాగా అర్ధరాత్రి 2గంటల సమయంలో చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. టీకా వికటించే తమ కుమారుడు మృతిచెందాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివశంకర్ తెలిపారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు హాజరు

- భర్త మరణాన్ని తట్టుకుని ఏఈఈ ఎగ్జామ్ రాసిన భార్య


హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న మంగ

మిర్యాలగూడ అర్బన్: భర్త అకాల మరణాన్ని దిగమింగుకుని, పుట్టెడు దుఃఖంలోనూ ఆదివారం తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) పరీక్షకు హాజరయ్యింది ఓ మహిళ. వివరాలు.. మిర్యాలగూడ మండలంలోని దుబ్బతండాకు చెందిన మాలోతు హరిబాబునాయక్, మంగ భార్యాభర్తలు. హరిబాబునాయక్ బీఆర్‌ఎస్ పార్టీలో చురుకుగా పనిచేస్తున్నాడు. మంగ బీటెక్(ఈఈఈ) పూర్తి చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంది. తాను ఉన్నత చదువులు చదవకున్నా తన భార్య ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో హరిబాబునాయక్ ప్రతిరోజు ఆమెను మిర్యాలగూడ పట్టణంలోని లైబ్రరీకి తీసుకొచ్చేవాడు. అయితే ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సభకు వెళ్తుండగా హరిబాబుకు హైబీపీ వచ్చి ఆస్పత్రిలో చేరగా బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో శుక్రవారం అతడి అవయవాలను కుటుంబ సభ్యులు జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థకు అప్పగించి మరో ఐదుగురికి ప్రాణదానం చేశారు. భర్త అకాల మరణం కృంగదీస్తున్నప్పటికీ అతడి కోరిక నెరవేర్చేందుకు గాను ఆదివారం హైదారాబాద్‌లో ఏఈఈ పరీక్ష రాసేందుకు మంగ హాజరయ్యింది. మంగ ఏఈఈ పరీక్షలో ఉత్తీర్ణురాలు కావాలని దుబ్బతండా వాసులు ఆకాంక్షించారు.

తుపాకులగూడెం సినిమాను ఆదరించాలి


సినిమా ప్రమోషన్‌లో పాల్గొన్న హీరోహీరోయిన్లు

భానుపురి(సూర్యాపేట): ఫిబ్రవరి 3న విడుదల కాబోతున్న రెబల్స్ ఆఫ్ తుపాకులగూడెం సినిమాను ఆదరించాలని హీరో భూక్యా శ్రీకాంత్ రాథోడ్ కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో ఆయన హీరోయిన్ జయేత్రితో కలిసి పాల్గొని మాట్లాడారు. కమ్యూనిస్టు భావాలున్న ఈ ప్రాంతం నుంచి తుపాకులగూడెం అనే మూవీతో ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. విభిన్నమైన కథతో వస్తున్న ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. ఈ సినిమా ద్వారా దాదాపు 25నుంచి 30మంది నటీనటులుగా పరిచయం అవుతున్నామని, కథ నచ్చడంతో స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ సంగీతం అందించారని తెలిపారు. సమావేశంలో నటీనటులు ప్రవీణ్, శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి మోటార్ మెకానిక్ దుర్మరణం


వెంకట్‌రెడ్డి మృతదేహం

మిర్యాలగూడ: ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి ఓ మోటార్ మెకానిక్ మృతిచెందాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం చెరుపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. మాడ్గులపల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెరువుపల్లి గ్రామానికి చెందిన కొలగొట్ల వెంకట్‌రెడ్డి(48) ఆదివారం అదే గ్రామానికి చెందిన కట్టా అరుణకు చెందిన వ్యవసాయ బావి వద్ద మోటార్‌ను రిపేర్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. బావిలో నీరు నిండుగా ఉండడంతో ఈత రాని వెంకట్‌రెడ్డి మునిగి ఊపిరి ఆడక మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయాలకు పూర్వ వైభవమే లక్ష్యం


శివాలయం పరిసరాలను శుభ్రం చేస్తున్న నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ సభ్యులు

భువనగిరి: పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ సభ్యులు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని చందుపట్ల గ్రామంలో గల పురాతన శివాలయాన్ని ఫౌండేషన్ సభ్యులు సందర్శించి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పట్నం కృష్ణంరాజు మాట్లాడుతూ.. గ్రామంలో 11వ శతాబ్దానికి చెందిన శివాలయం ఆదరణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరిందన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురాతన ఆలయాలను కాపాడాలనే లక్ష్యంతో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 18 ఆలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామ సర్పంచ్ చిన్నం పాండు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం


మూడు రోడ్ల కూడలిలో క్షుద్రపూజల ఆనవాళ్లు

మఠ్రిగూడ: మండల పరిధిలోని రాజాపేటతండా, రాంరెడ్డిపల్లి, చర్లగూడెం గ్రామాలకు వెళ్లే కూడలి వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం ఆ మూడు గ్రామాల కూడలిలో గుమ్మడికాయ, కొబ్బరికాయ, నిమ్మకాయలు, కోడి, కొత్త దుస్తులు, పసుపు, కుంకుమ కనిపించడంతో సమీప పొలాల రైతులు, వాహనదారులు చూసి భయభ్రాంతులకు గురయ్యారు. మూడు బాటల కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి


నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యక్తి మృతదేహం

చిట్యాల: పట్టణంలో అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తిని ఆదివారం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చిట్యాల ఎస్‌ఐ ఎస్. ధర్మా తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం .. చిట్యాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో గల మొబైల్ షాపు పక్కన అపస్మారకస్థితిలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు మున్సిపల్ సూపర్‌వైజర్ జోగు ప్రవీణ్ స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఆ వ్యక్తిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45ఏళ్లు ఉంటాయని, ఎరుపు రంగు టీషర్ట్ ధరించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బంద్రు నర్సింహులు జీవితం ఆదర్శనీయం


నివాళులర్పిస్తున్న అమర్, విమలక్క తదితరులు

ఆలేరు: సీపీఐ ఎంఎల్ జనశక్తి రాష్ట్ర నాయకుడు బండ్రు నర్సింహులు జీవితం ఆదర్శనీయమని వామపక్ష నాయకుడు అమర్ అన్నారు. ఆదివారం పట్టణంలో బండ్రు నర్సింహులు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన అరుణోదయ నాయకురాలు విమలక్కతో కలిసి పాల్గొని బండ్రు దంపతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అమర్ మాట్లాడుతూ.. బండ్రు జీవితం కొత్త తరానికి ప్రేరణ ఇవ్వడానికి పుస్తకాన్ని తీసుకువస్తామని, అలాగే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అరుణోదయ నాయకురాలు విమలక్క మాట్లాడుతూ.. బండ్రు నర్సింహులు జీవితం నేటి తరానికి మార్గదర్శమని అన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణ, సత్తన్న, బైరాగి, విష్ణు, యాదన్న, రమేష్, కుటుంబ సభ్యులు బండ్రు ప్రభాకర్, బండ్రు భాస్కర్, బండ్రు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

'అజోల్లా'తో పశుగ్రాసం కొరతకు చెక్

- తక్కువ ఖర్చుతో పశువులకు అధిక పోషకాలు అందుతాయి
- సిరిపురం పశువైద్యశాల పశువైద్యాధికారి మాడుపల్లి రవికుమార్

పాడి పంట

నడిగూడెం: వేసవిలో పశుగ్రాసం కొరతకు చెక్ పెట్టేందుకు అజోల్లా పెంపకమే సరైన పరిష్కారమని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. ఆకుపచ్చ ఫెర్న్ జాతికి చెందిన ఈ నీటి మొక్క త్వరితగతిన పెరుగుతుందని, ఇది పశుగ్రాసానికి ప్రత్యామ్నాయమని నడిగూడెం మండలంలోని సిరిపురంలో గల పశువైద్యశాల పశువైద్యాధికారి మాడుపల్లి రవికుమార్ చెబుతున్నారు. అజోల్లా ఉత్పత్తి, దాని వలన పశువులకు కలిగే లాభాలు ఆయన మాటల్లోనే..

పుష్కలంగా పోషక విలువలు


రవికుమార్, పశువైద్యాధికారి

అజోల్లా తిన్న పశువులకు అధిక పోషకాలు అందుతాయి. ఎండబెట్టిన అజోల్లా పొడిలో 25–35 శాతం వరకు మాంసకృత్తులు, 10–15 శాతం ఖనిజ లవణాలు, 7–10 శాతం అమినో ఆమ్లాలు, కెరోటిన్, బి–12 విటమిన్లు ఉంటాయి. అజోల్లాలో లిగ్నైట్ తక్కువగా ఉండడటం వలన పశువులు తేలికగా జీర్ణం చేసుకుంటాయి. ఒక కిలో అజోల్లా ఉత్పత్తికి 20–30 పైసలు మాత్రమే ఖర్చు అవుతుంది.

ఇలా పెంచాలి..

సూటిగా సూర్యకాంతి పడని కొద్దిపాటి నీడ గల భూమిని పూర్తిగా చదును చేసుకుని, 10 సెం.మీ లోతు గోతిని తవ్వాలి. అందులో చుట్టూ ఇటుకలను పేర్చి రైతుల తమకు ఇష్టమైన సైజులో ఒక తొట్టిని నిర్మించుకోవాలి. ఈ తొట్టి అడుగు భాగాన భూమిపై కలుపు పెరగకుండా ప్లాస్టిక్ సంచులు పరచాలి. దీనిపై 150 జీఎస్‌ఎం మందం ఉన్న ప్లాస్టిక్ షీటు వేయాలి. షీటు చివరలు ఇటుకల పై అంచువరకు వచ్చేలా తొట్టి మొత్తం పరచాలి. 30 నుంచి 35 కిలోల సారవంతమైన మట్టిని జల్లెడ పట్టి ప్లాస్టిక్ షీటుపై సమానంగా పరచాలి. ఒక చదరపు మీటరుకు 10 నుంచి 12 కిలోల పశువుల పేడను 10 లీటర్ల నీటిలో పలుచగా కలిపి, దానిలో 10–20 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్‌ను కలిపి పోయాలి. ఈ తొట్టిలో 7–10 సెం.మీ. ఎత్తు ఉండేలా నీరు పోయాలి. అందులోని మట్టి, నీటిని కలియ తిప్పాలి. ఆ తర్వాత 7–10 రోజుల్లో అజోల్లా పెరిగి నీటి తొట్టెను పూర్తిగా ఆక్రమిస్తుంది. 8వ రోజు నుంచి ప్రతి రోజు ఒక కిలో చొప్పున అజోల్లాను తొట్టి నుంచి తీసుకోవచ్చు.


తొట్టిలో పెంచిన అజోల్లా

పశువులకు మేపేది ఇలా..

ఇలా తొట్టి నుంచి తీసుకొచ్చిన అజోల్లాను చదరపు సెంటీమీటరు వెడల్పు ఉన్న రంధ్రాలు గల ప్లాస్టిక్ ట్రేలో ఉంచాలి. దానిని సగం నీరు నింపిన బక్కెట్‌పై పెట్టి పైనుంచి నీరు పోయాలి. ట్రేలో పైన ఉన్న అజోల్లాను పశువులకు మేపాలి. ట్రేలోని రంధ్రాల ద్వారా చిన్న చిన్న అజోల్లా మొక్కలు బక్కెట్‌లోని నీళ్లలోకి వెళతాయి. ఈ నీటిని మరలా తొట్టిలో పోయడం వలన అజోల్లాను తిరిగి పెంచవచ్చు. ప్రస్తుతం నడిగూడెం, కోదాడ మండలాల్లో వరి పొలాల్లో కూడా అజోల్లా కన్పిస్తుంది.

లాభాలు ఇవీ..

ప్రతి రోజు 1.5 నుంచి 2 కిలోల అజోల్లాను పశువులకు దాణాలో కలిపి తినిపించవచ్చు. దాణాలో వేరుశనగ పిండికి బదులుగా అదే పరిమాణంలో అజోల్లాను వాడవచ్చు. దీని వలన పాల దిగుబడి 15నుంచి 20 శాతం పెరుగుతుంది. పాలలో వెన్న శాతంలో పాటు ఎస్‌ఎన్‌ఎఫ్ పెరిగి ప్రతి లీటరు పాలకు 60 పైసలు నుంచి 150 పైసల వరకు అదనపు ఆదాయం వస్తుంది.